• హైదరాబాద్‌లో

# ఎంఎస్ఎన్ ఆర్&డీ

- రూ.150 కోట్లతో విస్తరణ
- విశాఖ, హైదరాబాద్‌లలో ఓ చోట గ్రీన్‌ఫీల్డ్ కేంద్రం
- 2013 నాటికి టర్నోవర్ లక్ష్యం రూ.1,000 కోట్లు




హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:

రాష్ట్రానికి చెందిన యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇంగ్రిడియెంట్స్(ఏపీఐ) తయారీ సంస్థ ఎమ్ఎస్ఎన్ ల్యాబొరేటరీస్ విస్తరణ కోసం వచ్చే మూడేళ్లలో రూ.150 కోట్లు వెచ్చించనుంది. ఇందులో భాగంగా పాశమైలారంలో పరిశోధన, అభివృద్ధి కేంద్రం(ఆర్ అండ్ డీ)తోపాటు మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల వద్ద ఉన్న సెజ్‌లో ఫార్ములేషన్ ఫెసిలిటీని ఏర్పాటు చేయనున్నారు. ఆర్ అండ్ డీకి రూ.60 కోట్లు వెచ్చించనున్నారు. ఇక్కడ 40 ల్యాబొరేటరీలను నెలకొల్పుతారు. నిర్మాణం వచ్చే ఏడాదికల్లా పూర్తవుతుంది. ఇక్కడ అంతర్జాతీయ ఫార్మా కంపెనీకు ఔషధ పరిశోధన, తయారీ సేవలను అందిస్తారు. ఇక రూ.50 కోట్ల అంచనా వ్యయంతో ఫార్ములేషన్ ఫెసిలిటీ నిర్మాణ పనులను వచ్చే ఏడాది ప్రారంభిస్తారు. 18 నెలల్లో ఫెసిలిటీ అందుబాటులోకి రావొచ్చని కంపెనీ భావిస్తోంది. ప్రస్తుతం కంపెనీకి నాలుగు ఏపీఐ తయారీ కేంద్రాలు, ఒక ఫినిష్డ్ డోసేజ్ తయారీ కేంద్రం ఉంది.

**గ్రీన్‌ఫీల్డ్ కేంద్రం..**

ఏపీఐ తయారీకి సంబంధించి గ్రీన్‌ఫీల్డ్ కేంద్రాన్ని హైదరాబాద్, విశాఖపట్నంలలో ఎక్కడ ఏర్పాటు చేయాలనేది కంపెనీ త్వరలో నిర్ణయించనుంది. ఏపీఐ విభాగంలో అంతర్జాతీయ మార్కెట్లు, ఫినిష్డ్ డోసేజ్ విభాగంలో భారత్‌తోపాటు వర్ధమాన దేశాలకు ప్రిఫర్డ్ సప్లయర్‌గా నిలవాలన్నదే ధ్యేయమని పేర్కొంది. ప్రస్తుతం కంపెనీ సాండోజ్ హెక్సెల్, టెవా రేషియో ఫార్మా, జెన్‌టివా, గెడియన్ రిక్టర్ వంటి జెనరిక్ సంస్థలకు 80కి పైగా ఏపీఐలను సరఫరా చేస్తోంది. 2013 నాటికి టర్నోవర్‌ను రూ.1,000 కోట్లకు, 2018 నాటికి రూ.5వేల కోట్లకు చేర్చాలనేది కంపెనీ లక్ష్యం. 2004లో ప్రారంభమై ఏటా 50% పైగా వృద్ధిని నమోదు చేస్తోంది. 2008-09లో రూ.250 కోట్ల టర్నోవర్ నమోదు చేసింది. 2009-10లో ఇది రూ.390 కోట్లు ఉండవచ్చని భావిస్తోంది.